ప్రజాశక్తి

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఇక సమరమే...!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 10 మంది
- పోటీ ఆ ముగ్గురు మధ్యే...
- పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీకోసం అభ్యర్థులకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం గురువారం సాయంత్రంతో ముగిసింది. నామినేషన్లను దాఖలు చేసిన వారిలో ఏ ఒక్కరూ ఉపసంహరించుకోకపోవడంతో బరిలో 10 మంది అభ్యర్థులు నిలిచారు. ఐతే ప్రధాన పోటీ మాత్రం ముగ్గురు అభ్యర్థుల మధ్యే ఉంటుందని ఊహాగానాలు సాగుతున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల దాఖలు కార్యక్రమం విశాఖ జిల్లా కలెక్టరేట్ కేంద్రంగా జరిగింది. టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థుల కోసం ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. 22,493 మంది టీచరు ఓటర్లున్నారు.

పోటీ ఆ ముగ్గురి మధ్యే...

యుటిఎఫ్ అభ్యర్థిగా ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) బలపరచిన కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యల అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది. రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఈమెకు మంచి స్పందన

మిగతా 2లో..

బరిలో ఉన్నది వీరే...

విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బదిలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకాలపాటి రఘువర్మ, పిఆర్‌టియు బలపరిచిన అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, బహుజన సమాజ్ పార్టీ బలపరిచిన పెదపెంకి శివప్రసాద్‌తోపాటు కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, సుంకర శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- 27న పోలింగ్
- 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిరప్రసాద్

వివరాలు వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్రలోని జిల్లాలకు ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేశామని, అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరించినట్లు తెలిపారు. 10వ తేదీ నాటికి నామినేషన్ల స్వీకరణ పూర్తయిందని, మొత్తం 10 మంది అభ్యర్థుల నుంచి 20 నామినేషన్లు స్వీకరించినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పదిమంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, ఎవరూ నామినేషన్‌ను వెనక్కి తీసుకోలేదని వెల్లడించారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని మౌలిక సదుపాయాలు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఎన్నికలలో 22,493 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పురుష ఓటర్లు 13,508, మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉంటారని, వారికి ఇప్పటికే రెండు రౌండ్ల శిక్షణ అందించినట్లు తెలిపారు. ఓటు వేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం స్లిప్పులు అందజేస్తామని, పోలింగ్

మిగతా 2లో..

అశ్వ జలప్రవేశం

▶ వార్తలు మెయిన్‌లో..

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

▶ వార్త 6లో..

ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీలపై 19న ధర్నా

▶ వార్త 8లో..

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

▶ వార్త 4లో..

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో మృతిచెందిన చంద్రవంశీ (ఫైల్)

నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్య

యాజమాన్యంపై చర్యకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

వార్త మెయిన్‌లో....

ఆపరేషన్ 'కగార్'ను నిలిపేయాలి

- ఆదివాసీ ప్రజలపై మారణకాండ ఆపాలి
- వామపక్ష, ప్రజాసంఘాలు డిమాండ్

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పోలేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆదివాసీలపై మారణకాండ ఆపి, ఆపరేషన్ కగార్‌ను బేషరతుగా నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్షాలు, ఆదివాసి హక్కులు, దళిత, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దేశ అటవీ ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తలపెట్టి, ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తూ అడవులను నెత్తుటి క్షేత్రంగా మార్చుతోందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాదిగా బస్తరు అబుజ్మడ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం ఊచకోత సాగిస్తుందన్నారు. మావోయిస్టుల పేరుతో అడవులను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో ఆదివాసీలను బూటకపు ఎదురుకాల్పులు చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకొని న్యాయ విచారణ జరిపి, చట్ట ఉల్లంఘనలు పాల్పడిన వారిని శిక్షించాలని కోరారు. ఆదివాసీల చట్టాలను నీరుగార్చుతున్న, రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల మనుగడకు, జీవనోపాధికీ తెచ్చిన చట్టాలను, చట్టబద్ధ సౌకర్యాలన్నింటినీ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అడవులు కార్పొరేట్ల ఆస్తిగా మారితే ప్రకృతి సమతుల్యత, పర్యావరణం దెబ్బతిని మరింత ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. ఆపరేషన్ కగార్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించరాదని చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఎపిలో కూడా అటవీ ప్రాంతాల సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు జి.పోలేశ్వరరావు (సిపిఎం), జిఎస్‌జె.అచ్యుతరావు (సిపిఐ), వై.కొండయ్య (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), ఎం.వెంకటేశ్వర్లు (ఐఎఫ్‌టియు), నంబూరి శ్రీమన్నారాయణ (పౌర హక్కుల సంఘం), విఎస్.కృష్ణ (హెచ్‌ఆర్‌ఎఫ్), ఎం.లక్ష్మి (పిఒడబ్ల్యు), కె.లలిత

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇక సమరమే...!

లభిస్తోంది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ బరిలో పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరించడం టీచర్లందరిలోనూ తాజాగా చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీ పడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వ్యాపకంగా మారిపోయింది. జాతీయ విద్యావిధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషితం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఉద్యమ స్ఫూర్తితో కోరెడ్ల విజయగౌరి ముందుకు సాగుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

కేంద్రంలో గుర్తింపు కార్డును చూపించి స్లిప్పులు పొందాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అనగా ఫిబ్రవరి 25 సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎటువంటి ప్రచారం చేయరాదని తెలిపారు. మార్చి 3వ తేదీన ఉదయం 8 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ బ్లాక్‌లో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, దీనికి ఎన్నికల కమిషన్ అనుమతి రావాల్సి ఉందని పేర్కొన్నారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 ఎంసిసి బృందాలను నియమించామని, మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

ఆపరేషన్ 'కగార్'ను నిలిపేయాలి

(సిఎంఎస్), కె.పద్మ (ఖైదీల విడుదల కమిటీ), వి.మల్లేష్, వి.పార్వతి (అఖిల భారత ఆదివాసి వేదిక), కె.చిన్నారావు (భీం సేన వార్), ఎస్‌వి.రమణ (దళిత విముక్తి), లక్ష్మి (మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం), బూసి వెంకటరావు (విరసం), వై.నూకరాజు (భానాస), శ్రీనివాస్ (భారత బచావో) తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులు ఆపాలి : బొత్స

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులపై కక్ష సాధింపు చర్యలను పక్కన పెట్టి రాష్ట్రంలో పాలనపై దృష్టి సారించాలని వైసిపి ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హితవుపలికారు. బీచ్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి నాయకులు పాలనను పక్కన పెట్టి రాజకీయ ప్రత్యర్థులపై విచక్షణారహితంగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే వల్లభనేని వంశీని అరెస్ట్ చేశారని, దీనిని పార్టీ తరపున ఖండిస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలు వృథా చేసిందని, ఎన్నికల హామీలు ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ మీడియా సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, కుంభా రవిబాబు , అదీప్‌రాజు, కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

వైద్యానికి కంచర్ల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖలోని అంబేద్కర్ కాలనీకి చెందిన జి.నూకరాజు కిడ్నీ, లీవర్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఉపకార్ ట్రస్టు చైర్మన్, ఏపీజేయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు దృష్టికి రావడంతో ఆయన స్పందించి తక్షణ సహాయం కింద రూ.5వేలు బాధితునికి అందజేశారు. రానున్న రోజుల్లో కూడా తనవంతు సహాయం అందిస్తానని చెప్పారు. నూకరాజు తీవ్ర అనారోగ్యంతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

ఏలూరులో వందే భారత్‌కు ప్రయోగాత్మక స్టాప్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సికింద్రాబాద్-విశాఖపట్నం- వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్వకు ఏలూరు స్టేషన్లో ప్రయోగాత్మక స్టాప్‌ను ఈ నెల 25 నుంచి మరో ఆరు నెలల పాటు కొనసాగుతుందని రైల్వే అధికారులు ప్రకటించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులు సహకరించాలి : రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకంలో, ప్రచారంలో, అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. వాహనాలు, కరపత్రాల ముద్రణ, ప్రచారం వంటి అంశాలకు సంబంధించిన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో డెస్కు ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఇతర జిల్లాల్లో నిర్వహించబోయే ర్యాలీలు, ప్రచారాలకు సంబంధించి ఆయా జిల్లాల ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ రెండు జిల్లాల సరిహద్దుల్లో ఏదైనా కార్యక్రమం నిర్వహించాలన్నప్పుడు తనను సంప్రదించాలని సూచించారు.

నేర చరిత్ర లేనివారిని ఏజెంట్లుగా నియమించుకోవాలి

ఎటువంటి నేరచరిత్ర లేని వారిని పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలని అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉద్యోగాలు చేస్తున్న వారిని, రాజకీయ పదవులు ఉన్నవారిని నియమించుకోరాదని స్పష్టం చేశారు. ప్రచారం విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, కరపత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ వివరాలను పొందుపరచాలని సూచించారు. నమూనా బ్యాలెట్ పత్రాలను రూపొందించుకునేటప్పుడు నిబంధనలు పాటించాలని చెప్పారు. జాతీయ జెండా, మతం, కులాన్ని ప్రతిబింబించేలా ఎలాంటి పత్రాలను రూపొందించుకూడదన్నారు. పోలింగ్ కేంద్రంలో అధికార యంత్రాంగం ఏర్పాటుచేసిన వైలెట్ కలర్ పెన్నును ఉపయోగించి ఓటరు తనకు నచ్చిన వ్యక్తికి ఎదురుగా సంబంధిత రోమన్ లేదా ఆంగ్ల నెంబరు వేయాలని సూచించారు. ఎలాంటి రాతలు రాయకూడదని, టిక్ మార్కులు పెట్టరాదని, అలా చేస్తే ఓటు చెల్లదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలపై అభ్యర్థులు ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎఆర్‌ఓ బిహెచ్.భవానీ శంకర్, ఎన్నికల సెల్ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్‌పై దౌర్జన్యం

పనులు నిలిపివేసి ఆందోళనకు దిగిన కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెల్లవారుజామున విధుల నిర్వహణలో ఉన్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు కాకర రాజుపై రాంబాబు దౌర్జన్యానికి పాల్పడి తీవ్రంగా గాయపరిచిన సంఘటనకు నిరసనగా గురువారం 34వ వార్డులో మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించారు. జగదాంబ జోన్ పరిధిలోని 8 వార్డులలో పనులు నిలిపివేసి, సంఘటన జరిగిన ప్రాంతానికి వచ్చి కార్మికులు రోడ్డుపై బైఠాయించి, అరగంటసేపు పనులను నిలిపివేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జరిగిన నిరసన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న కార్మికునిపై దౌర్జన్యం చేసి గాయపరిచిన రాంబాబును తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రక్షణ లేని పరిస్థితుల్లో వీధులలో రోడ్లను శుభ్రం చేస్తూ తాము విధులను ఎలా నిర్వహించగలమని ప్రశ్నించారు. కార్మికుల నిరసన విషయం తెలియడంతో జోన్ 4 కమిషనర్ మల్లయ్య నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని, కార్మికుంపై దౌర్జన్యానికి పాల్పడ్డ వ్యక్తిపై జివిఎంసి తరపున పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి నిరసన ప్రాంతానికి వచ్చి, సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికుడికి అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జగదాంబ జోన్ నాయకులు ఎం.ఈశ్వరరావు, జె.నాయుడు, నయోమి, భాస్కర్, జి.లక్ష్మి, శ్యామల, పైడితల్లి, జగదీష్, కార్మికులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న విజయశ్రీ

విజయశ్రీకి ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి -ఎవిపి కాలనీ : బయో టెక్నాలజీ విభాగ పరిశోధక విద్యార్థిని యేసుగుపల్లి విజయశ్రీకి ఎయు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు ఆమెకు పిహెచ్‌డి పట్టా అందించారు. 'గ్రీన్ సింథసిస్ అండ్ కేరక్టరైజేషన్ ఆఫ్ మెగ్నీషియమ్ ఆక్సైడ్ నానోపార్టికల్ విత్ ఏస్ ఎంఫాసిస్ ఆన్ ది ఎఫెక్ట్ ఆఫ్ సీడ్ జర్మినేషన్, ఫిషియోలాజికల్, బయో మెలెక్యూలర్ అండ్ ప్రోటీఓమిక్ రెస్పాన్సస్ ఇన్ రెడ్ చిల్లీ కల్టివేర్స్' అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను విజయశ్రీ డాక్టరేట్ పొందారు. బయో టెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ ఆచార్య జి. సుధాకర్ పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి.

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మూడు నెలలుగా ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో పోరాట నిధి (స్ట్రగుల్ ఫండ్) సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల పోరాటానికి సంఘీభావంగా ఎల్ఐసి ఉద్యోగ సంఘం (ఐఐఇఎ) రూ.10 వేలు అందజేశారు. కార్మికులకు అండగా నిలిచిన ఎల్ఐసి ఉద్యోగ సంఘానికి విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు ధన్యవాదాలు తెలిపారు.

విఎంఆర్‌డిఎ ప్రధాన ఇంజినీర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విఎంఆర్‌డిఎ ప్రధాన ఇంజినీర్‌గా నియమితులైన వినయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విఎంఆర్‌డిఎ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేసేలా చూడాలని వినయ్‌కుమార్‌కు ప్రణవ్ గోపాల్ సూచించారు.

రాష్ట్రంలో కుంటుపడిన పాలన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి పాలన కుంటిపడిందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. ఆశీలమెట్ట కార్యాలయంలో గురువారం నూతనంగా నియమితులైన వైసిపి విశాఖ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చెన్నా జానకిరామ్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా సెక్రటరీలు అబిరెడ్డి ఆదివిష్ణు రెడ్డి, గురజాలపు రవి పలువురు వైసిపి నాయకులు వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

CHANGE OF NAME

I, PECHETTI VENKU NAIDU
(New Name)
S/o. P.Appala Naidu,
R/o. D.No. 3-40/O, Muthyamamba Colony, Vepagunta,
Visakhapatnam-530047.
have changed My Name
PECHETI VENKUNAIDU
(Old Name) to
PECHETTI VENKU NAIDU
(New Name) hence after all my Documents and Correspondence will continue with my New Name
PECHETTI VENKU NAIDU
for all purpose

మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
SOP 1/2025

Between :
Vardhamana Lakshmi Tulasi Devi
Toleti Venkataratnam ...Petitioners

And :
1. State Bank Of India, Main Branch, Anakapalle Represented by Branch Manager.
2.Indian Overseas Bank, Anakapalle Branch Represented by Branch Manage.
...Respondents

జనరల్ నోటీస్

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషనును యిందలి పిటీషనర్లు సెక్షను 372 of INDIAN SUCCESSION Act ప్రకారం Succession Certificate ను ఇప్పించమని కోరుచూ పై కోర్టులో సదరు పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషనును తే.5-3-2025దికి వాయిదా వేయడమైనది. సదరు వాయిదా రోజున ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలున్న యెడల పై కోర్టు వారి ఎదుట పై తేదిన ఉదయం 10:30ని॥లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునుగాని యిందు మూలంగా తెలియజేయడమైనది.

మజ్జి శ్రీనివాసరావు
అడ్వకేట్, అనకాపల్లి.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VIZIANAGARAM
I.A.544/2022 in O.S.467/2012

Between:
Gurajada Madhusudana Rao ...Petitioner/2nd Defendant

And:
Gurajada Venkata Lakshmi and 2 others ...Respondents/Plaintiffs
Gurajada Meenakshi and 3 others ...Respondents/Defendants 1,3 to 5

NOTICE

To,
R-3: Gurajada Manjusha,
D/o. late Sudarshana Rao,
R/at D.No.49-46-17,
Akkayyapalem,
Visakhapatnam.

Take notice that the petitioner/ 2nd defendant filed the above I.A. against you, the above respondents to condone a delay of 1460 days in filing the petition to set aside the ex-parte decree dated 05-06-2018 passed in the above suit and the said I.A. stands posted to 04-03-2025 for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on 04-03-2025 at 10:30 A.M in the above Court to answer all material questions, failing which the above I.A. will be heard and determined in your absence.
(By Order of the Hon'ble Court)
P. V. RAJAGOPAL,
Advocate
Visakhapatnam,
Cell: 98482 65456.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, గాజువాక, విశాఖపట్నం.
O.S.No. 71 / 2023

పిటీషన్:
తెంటు సత్యనారాయణ . . . వాది

అండ్:
సాగిరాజు వెంకట అప్పల సోమశేఖర
రంగరాజు వగైరాలు . . . ప్రతివాదులు

ప్రతివాది నెం.3 నోటీసు

ప్రతివాది నెం.3:
పొట్నూరు అగ్నిల్ మధుసూదన్‌రావు,
తండ్రి పొట్నూరు అప్పలనాయుడు,
డో.నెం. 34-8-15/2, నికోలస్‌వీధి,
ఈ-సేవదారి, జ్ఞానాపురం, విశాఖపట్నం.

పైవాది మీ మీదన పైన వివరించిన వ్యాజ్యము తెలిపినందున సదరు దావాకు మీరు ప్రతివాది నెం.3 ప్రత్యుత్తరము తెలియ పరచుటకు తేది:28-02-2025 తారీఖుని ఉదయం 10-30 గంటలకు స్వతహగా లేక సరియైన భోగట్ట ఇవ్వబడిన వకీలుగారి ద్వారా ఈ కోర్టులో హాజరు అయ్యేటట్లు ఇందువలన మీకు ఆజ్ఞాపించడమైనది. పైన చెప్పబడిన దినమున మీరు హాజరుకానిచో మీకు పై కేసులో మీకు వాదన లేదని భావించి మీ పరోక్ష మందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించుట అగునని తెలియజేయటం అయినది.

వాయిదా తేది: 28-02-2025
వాది తరపున న్యాయవాది
A.V.LENIN, Advocate, H.No.26-49-2/2
Chaitanya Nagar, Gajuwaka,
Visakhapatnam.Cell : 9666108999

'నారాయణ' యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యార్థి మృతికి కారణమైన నారాయణ కాలేజీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయకుండా విద్యార్థులను అరెస్ట్ చేయడం దుర్మార్గమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పరదేశిపాలెం నారాయణ కాలేజీ యాజమాన్యం వేధింపు వల్లే చంద్రవంశీ అనే విద్యార్థి చనిపోయాడన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజయ్, ఎల్జీ నాయుడు, ఇతర నాయకుల్ని అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ప్రత్యక్ష పోరాటం తప్పదని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ నేతల అరెస్టు దుర్మార్గం : డివైఎఫ్ఐ

విశాఖ కలెక్టరేట్ : పరదేశిపాలెం నారాయణ కాలేజీ యాజమాన్యం ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి చంద్రవంశీకి న్యాయం జరగాలని పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యుఎస్ఎన్ రాజు, కె. సంతోష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. బాధ్యులైన నారాయణ కాలేజీ యాజమాన్యాన్ని వదిలేసి, ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పోలీస్ కమిషనర్, కలెక్టర్ కలుగజేసుకొని విద్యార్థికి న్యాయం జరిగేలా సదరు యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కోరారు. లేకుంటే విద్యార్థి, యువజన సంఘాల ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

విద్యార్థి మృతిపై నివేదిక అందించండి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు మధురవాడ సమీపంలోని పరదేశిపాలెం నారాయణ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ విద్యార్థి కోన చంద్రవంశీ (17) కాలేజీ మేడ పైనుంచి దూకి బలవన్మరణంపై పోలీసులు, ఇంటర్ విద్యాశాఖ అధికారులు సమగ్ర నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. విద్యార్థి చంద్రవంశీ ఒత్తిడి వల్ల చనిపోయారా? లేక ఆయన మరణానికి ఇతర మరేమైనా కారణాలున్నాయా? అన్న సూక్ష్మ కోణంలో దర్యాప్తు చేపట్టి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పూచీకత్తుపై ఎస్ఎఫ్ఐ, సిఐటియు నేతల విడుదల

ఆనందపురం : చదువుపై సరిగా దృష్టి పెట్టడం లేదని లెక్చరర్ మందలించడంతో, మనస్తాపానికి గురైన పరదేశీపాలెం నారాయణకాలేజీ విద్యార్థి చంద్రవంశీ, కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతికి యాజమాన్య నిర్లక్ష్యవైఖరే కారణమని కాలేజీ వద్ద నిరసనకు దిగిన ఎస్ఎఫ్ఐ నేతలు, ఆందోళనకారులను ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పిఎం.పాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని సిఐ చింతా వాసు నాయుడు ఆధ్వర్యంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో సిఐటియు మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ అజయ్, జిల్లా సెక్రెటరీ నాయుడు,జిల్లా నాయకులు జి రాము, సాయి, తేజ, హర్షిత్ ,రాము ,అరుణ్ ,సునీల్, నిఖిల్ తదితరులు ఉన్నారు వీరిని పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం వరకు ఉంచి, అనంతరం పూచీకత్తుపై విడుదల చేశారు.

పద్మనాభుని కల్యాణోత్సవాలకు సన్నహాలు

ప్రజాశక్తి-పద్మనాభం : స్థానిక అనంతపద్మనాభస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవాలను వచ్చే నెల 9 నుంచి 15వరకు నిర్వహిస్తున్నట్లు నానాజీ బాబు తెలిపారు.గురువారం కుంతీమాధవస్వామి ఆలయంలో భక్తులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆలయ పురోహితులు సీతారామాంజనేయులు వివరాలు వెల్లడించారు.వచ్చేనెల 6న స్వామి కల్యాణానికి పెళ్లిరాట, 10న కల్యాణం, 12న తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఎంపిపి కె.రాంబాబు, సత్యనారాయణ, ప్రసాదు నాయుడు, పద్ద సన్యాసిరావు పైడిరాజు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం :కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి విశాఖపట్నం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా బాణాల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా అల్లు శంకరరావు, ట్రెజరర్‌గా కె.అనిల్ కుమార్ నూతనంగా నియమితులైన సందర్భంగా గురువారం విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కె.కె రాజును మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరం సమిష్టిగా కృషిచేద్దామన్నారు.

సింహాచలం దేవస్థానం భూమి స్వాధీనం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు గణేష్‌నగర్ వద్ద నరసింహనగర్, రైతు బజార్‌పైన రూ.72కోట్ల విలువచేసే, సుమారు 7200 గజాల సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలాన్ని కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం స్వాధీనం చేసుకున్నట్లు దేవస్థానం ఇఒ త్రినాధరావు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైనా మళ్లీ ఆక్రమణకు పాల్పడితే కోర్టు నిబంధనల మేరకు తగిన చర్యలు ఉంటాయన్నారు..

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దేవస్థానం అధికారులు

రోడ్డెక్కిన 'నోవాస్' నివాసితులు

- గంగవరం పోర్టు వాహనాల కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, నేతలు పట్టించుకోవడం లేదని మండిపాటు
- తక్షణం స్పందించకుంటే రోడ్డు బ్లాక్ చేస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి -గాజువాక.: జివిఎంసి 76వ వార్డు గంగవరం పోర్ట్‌కు వెళ్లే రోడ్డులో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన నోవాస్ నివాస్ గేటెడ్ అపార్ట్‌మెంట్‌లో నివాసానికి నానా అవస్థలు పడుతున్నామని అపార్ట్‌మెంట్‌వాసులు గురువారం రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు.అపార్ట్‌మెంట్ మీదుగా వెళ్లే రోడ్డులో గంగవరం పోర్టుకు వెళ్లే భారీవాహనాల రాకపోకలతో శబ్ద, వాయు కాలుష్యంతో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. .ఇదేమార్గంలో రోడ్డుపైనే అడ్డదిడ్డంగా భారీ వాహనాల పార్కింగ్‌తోపాటు అక్కడే మద్యాన్ని తాగుతూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రోడ్డుపై ఎక్కడా స్పీడ్‌బ్రేకర్లు గానీ లేకపోవడంతో మితిమీరిన వేగంతో భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని, అలాగే వాటి నుంచి వెలువడే దుమ్ము,ధూళి కాలుష్యంతో చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు శ్వాసకోశసమస్యలు, ఇతర అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమార్గంలో వీధిదీపాలు లేకపోవడంతో పొద్దుగుంకితే చాలు బయటకు రావాలంటే భయమేస్తోందని అంటున్నారు.

దీనిపై కాలుష్యనియంత్రణ మండలి అధికారులతోపాటు ,పోలీసులు, ఇతర సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకమార్లు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ గోడును పట్టించుకోవాలని, భారీ వాహనాల రాకపోకలతో తలెత్తే శబ్దం, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేకుంటే రోడ్డు మొత్తాన్ని బ్లాక్ చేయకతప్పదని నోవాస్ నివాసితులు హెచ్చరిస్తున్నారు.

సమాజ హితం కాంక్షించేలా సాహిత్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమాజ హితం కోరేదిగా సాహిత్యం ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ మంజుల అన్నారు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "అభ్యుదయ సాహిత్యం వికాసం' అంశంపై సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తూ, తెలుగు భాష ప్రత్యేకతను, ఔన్నత్యాన్ని ప్రిన్సిపాల్ మంజుల వివరించారు ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జె అప్పారావు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో అభ్యుదయ , సాహిత్య కవులు భాగస్వాములు కావాలని కోరారు. సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ విష్ణు మూర్తి, తెలుగు విభాగాధిపతి ప్రవీణ, ఐక్యు.ఎసి కోఆర్డినేటర్ బి ప్రసాదరావు, అకడమిక్ కో ఆర్డినేటర్ బి సహదేవుడు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

180 మందికి కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస: దివీస్ ఆధ్వర్యంలో :భీమిలి మండలం, చిప్పాడలో డిసెంబర్‌లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన 180మందికి గురువారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఎంపిడిఒ ఎస్.హనుమంతరావు పాల్గొని, లబ్దిదారులకు వీటిని అందజేశారు. వైజాగ్ ఎల్వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో వీరికి కళ్లద్దాలు అవసరమని ధ్రువీకరించగా, దివీస్ సిఎస్ఆర్ సేవల్లో భాగంగా రూ.1,48,500 విలువైన కళ్లద్దాలను అందజేశారు. ఎంఇఒ ఎం శివరాణి, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ శ్రీనివాస్, కె నరసింహ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-కె.కోటపాడు : బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన కె.కోటపాడు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... చోడవరం మండలం గవరవరం గ్రామానికి చెందిన అప్పికొండ కిరణ్ (20), మరో యువకుడు గురువారం పెందుర్తి నుండి తన స్వగ్రామానికి పల్సర్ బైక్‌పై వెళ్తున్నారు. కె.కోటపాడు దాటిన తర్వాత డంపింగ్ యార్డ్ సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలైన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తన వెనుక ఉన్న మరో యువకుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కిరణ్ తండ్రి అప్పికొండ బాబూరావు హుటాహుటిన వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న బాబూరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో చిన్న కుమారుడు కిరణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చోడవరం ఆస్పత్రికి తరలించారు.

చోరీకి పాల్పడ్డ యువకుడు అరెస్టు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామంలో బంగారం చోరీకి పాల్పడి పరారైన యువకుని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు పరవాడ డిఎస్పి విష్ణు స్వరూప్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 10న గణపర్తి గ్రామానికి చెందిన కాండ్రేగుల సన్యాసమ్మ తన పొలంలో పని చేస్తుండగా కసింకోట మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన యువకుడు మజ్జి శ్రీధర్ బైక్‌పై వచ్చి, ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారం, రెండు తులాలకు తక్కువగా గల నల్లపూసల తాడును లాక్కొని పోయాడు. దీనిపై సన్యాసమ్మ 11వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్సై ప్రసాదరావు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 12వ తేదీన పూడిమడక బైపాస్ జంక్షన్‌లో నిందితుడు సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై ప్రసాదరావు తన సిబ్బందితో వెళ్లి శ్రీధర్‌ను అరెస్టు చేశారు. ఆయన వద్ద నుండి నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీధర్‌ను కోర్టుకు హాజరపరుస్తున్నామని తెలిపారు. నిందితున్ని పట్టుకున్న ఎస్సై ప్రసాదరావు, సిబ్బంది డి లీలాకృష్ణ, కె.రమణలను డిఎస్పి విష్ణు స్వరూప్ అభినందించారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- ములగాడ: పారిశ్రామిక ప్రాంతంలో మల్కాపురం, రామకృష్ణాపురం, తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను గురువారం తొలగించారు. జివిఎంసి కమిషనర్, ట్రాఫిక్ ఎడిసిపి, ఎసిపి ఆదేశాల మేరకు మల్కాపురం ట్రాఫిక్ సిఐ షణ్ముఖరావు, ఎస్ఐ అప్పారావు సహకారంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ యంత్రాంగం సహకారంతో తొలగించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ షణ్ముఖరావు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలతో పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోందని, దీంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించామన్నారు.కార్యక్రమంలో సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వేడుకల్లో డిజెలు, డ్యాన్స్‌లకు అనుమతుల్లేవు!

ప్రజాశక్తి -ఆనందపురం : వేడుకలు ఎటువంటివైనా వాటిల్లో డిజెలు, మహిళలతో అసభ్యకర డ్యాన్స్‌లకు ఎటువంటి అనుమతులు లేవని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక సిఐ వాసునాయుడు హెచ్చరించారు. ఇటీవల కాలంలో పెళ్లిళ్లు,వాణీ ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాల్లో పెద్దశబ్దాలతో డిజెలు పెడుతూ, మహిళలతో డాన్సులు చేయిస్తున్నారని, దీనిపై పలుమార్లు సూచనలు, హెచ్చరికలు చేస్తున్నా నిర్వాహకుల్లో ఎటువంటి స్పందన, మార్పు ఉండడం లేదని మండిపడ్డారు. నిబంధనలను ఉల్లంఘిస్తే నిబంధనల మేరకు మూడు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలుశిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు. వేడుకల నిర్వాహకులు గమనించి, సహకరించాలని కోరారు.

బినామీలు, అక్రమ వసూళ్లపై చర్యలు

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి- సీతమ్మధార :పూర్ణామార్కెట్ రోడ్డు మార్గంలో వ్యాపారాలు చేసుకోవడానికి తమకు తిరిగి అవకాశం కల్పించాలని చిరు వ్యాపారులు కోరారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పూర్ణా మార్కెట్‌లో ఆకుకూరలు,పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ,30 సంవత్స రాలుగా 120 మంది జీవిస్తున్నామని వీటిని పూర్తిగా తొలగించారని తెలిపారు. రోజుకు రూ.200 నుంచి రూ. 300 అద్దె వసూలు చేస్తున్నట్లు, జివిఎంసికి మాత్రం రూ.20 ఆశీలు చెల్లిస్తున్నట్లు రసీదులు ఇస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. కొంతమంది దళారుల చేతిలో అనేక షాపులు ఉన్నాయని, వాటిని అద్దెలకిస్తూ జేబులు నింపుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు..అనేకమంది బినామీలు పేర్లతో దౌర్జన్యంగా దుకాణాలు నిర్వహిస్తున్నారని దీనిపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పందిస్తూ, పూర్వపరాలు పరిశీలించి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలాగా చూస్తానిహామీ ఇచ్చారు. బినామీ పేర్లతో వసూలు చేస్తున్న వారిపైనా, ఆశీలు అధికంగా వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘీభావ ర్యాలీ

తగరపువలసలో సంఘీభావ ర్యాలీ చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-తగరపువలస :తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఢిల్లీలో పెన్షనర్ల ఆందోళనకు మద్దతుగా స్థానికంగా ఉన్న పలువురు పెన్షనర్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస ప్రాంత ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి ప్రధాన రహదారి గుండా జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈసందర్భంగా సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు, ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, కోశాధికారి పంపాన సూర్య నారాయణ మాట్లాడుతూ,కనీస పింఛను రూ 9 వేలు ఇవ్వాలని, రైల్వేలో ప్రయాణ రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సిహెచ్ అప్పారావు, జీరు సత్యారావు పాల్గొన్నారు

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో 12వ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా గురువారం బాబాకు ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు, జివిఎంసి అడిషనల్ కమిషనర్ ఎలంగి సోమన్నారాయణ, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ గవరరాజు, 76వ కార్పొరేటర్ గంధం శ్రీను పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.పాత్రో, ట్రస్టీలు మంగరాజు, బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : కైలాసగిరి 11 కెవి విద్యుత్ ఫీడర్ నిర్వహణ, లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు నరికివేత వంటి పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం దయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్, బిఎన్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతవాక కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

విజయగౌరి విజయానికి విస్తృత ప్రచారం

ములగాడలో ప్రచారంలో మాట్లాడుతున్న అజ శర్మ

ప్రజాశక్తి - ములగాడ :ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. గురువారం సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయ, ప్రభుత్వ, జివిఎంసి పాఠశాలలతోపాటు సరస్వతి విద్యావిహార్, లక్ష్మీఅమర్, దివాకర్ వంటి ప్రయివేటు విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం చేశారు

ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ, విద్య,ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో పోరాడుతున్న పిడిఎఫ్‌కు మరింత బలం చేకూర్చాలంటే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి విజయగౌరిని గెలిపించాలని కోరారు.శాసనమండలిలో ఉపాధ్యాయ వాణిని వినిపించడం ద్వారా ప్రయివేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డు మంజూరు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని భరోసానిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ సమస్యలపై సమర్ధవంతమైన పోరాటంలో ఓర్పు, నేర్పు, చిత్తశుద్ధితోపాటు గొప్ప విలువలున్న పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి, పి.పైడి రాజు కె.పెంటారావు,ఎ.సత్యారావు పెన్షనర్స్ అసోసియే షన్ నేతలు కె.నూకరాజు, ఆర్.దేవరాజు పాల్గొన్నారు.

మధురవాడ : విద్య, ఉపాధ్యాయ సమస్యలపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ప్రశ్నించి,పోరాడే సత్తా, ప్రగతిశీల శక్తిగల పిడిఎఫ్ తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోటీలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి ప్రథమ ప్రాధాన్యత ఓటేసిగెలిపించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. గురువారం విజయ గౌరి విజయాన్ని కాంక్షిస్తూ మధురవాడ, కొమ్మాది,ప్రాంతాలలో చైతన్య జూనియర్ కళాశాల, ఎపి గిరిజన సంక్షేమ ప్రతిభా బాలికల విద్యాలయం, మాలతంబ విద్యానికేతన్ తదితర విద్యాసంస్థలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలోఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ పిడిఎఫ్ మినహా, ఏ ఇతర ఎమ్మెల్సీలు శాసనమండలిలో సమస్యలపై నోరు విప్పే పరిస్థితి లేదన్నారు. సమస్యలపై పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా, ధైర్యంగా నిలబడి ప్రశ్నించే సత్తా ఉన్న విజయగౌరిని గెలిపించాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, కెఎం కుమారమంగళం, రఘుపతి వెంకటరమణ, డి అప్పలరాజు, బి భారతి, డి.కొండమ్మ పాల్గొన్నారు.

గాజువాక : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో గాజువాకలో పలు పాఠశాలల్లో విస్తృత ఎన్నికలప్రచారం నిర్వహించారు. చలపతి, భాష్యం, ఆదిత్య, సిద్ధార్థ, ప్రగ, ఎస్ఎఫ్ఎస్, మార్వెల్ తదితర విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ ఓటర్లను కలిసి, విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్, రాష్ట్ర నాయకులు అప్పారావు, సహాయ కార్యదర్శి రిజ్వాన్, ఎస్‌పి రాజు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు పి లక్ష్మిస్వామి, జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ రమేష్ కుమార్, ఐద్వానేత కె.సంతోషం, సిఐటియు నేత ఎ.లోకేష్, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్, ప్రజాసంఘాల నేతలు

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

కొత్తూరులో ప్రచారంలో మాట్లాడుతున్న అభ్యర్థి విజయగౌరి

కొత్తూరు(శ్రీకాకుళం జిల్లా) : విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్ పేట మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులను విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల మినిమం టైమ్ స్కేలు, ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా సంస్కరణల ఫలితంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని విమర్శించారు. దీనివల్ల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, పాఠశాల సహాయకుల పోస్టులు మిగలనున్నాయన్నారు. తద్వారా భవిష్యత్ నియామకాలు, ప్రమోషన్లు కష్టంగా మారనున్నాయని తెలిపారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకనవుతానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, మహిళా నాయకులు డి.స్వర్ణలత, ఆర్.జ్యోతి, ఎన్.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

నిరసనలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి -ములగాడ : ఆప్కాస్‌ను రద్దుచేసి, జివిఎంసి కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి అన్నారు. గురువారం 58, 59, 60, వార్డుల కార్యాలయాల వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రతి నెలా జీతాలు సక్రమంగా చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ పటిష్టంగా అమలు చేయాలని, చనిపోయిన, అనారోగ్యానికి గురైన, దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న కార్మికులను వెంటనే విధుల్లోకి చేర్చుకోవాని కోరారు. 60ఏళ్లు నిండి, విధుల నుంచి తొలగించిన వారికి 62ఏళ్ల వరకు విధుల్లో కొనసాగేలా వారిని మళ్లీ చేర్చుకోవాలన్నారు. యూనిఫాం, భద్రతాపరికరాలు, సౌకర్యాలను కల్పించాలన్నారు. యూనియన్ మల్కాపురం జోన్ అధ్యక్షులు కె. రమణ, జోన్ నాయకులు బి.రాంబాబు డి. రాము, బి. సూరిబాబు, ఎన్ గంగులు, డి.రాజు, కృష్ణ, రైలుబాబు, సిహెచ్.లక్ష్మి, కె. ఆదిలక్ష్మి, డి అప్పలకొండ శ్యామల పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలతో అవస్థలు

ప్రజాశక్తి- సీతమ్మధార :సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగంలోని ఖాళీ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారపోతోందనే విమర్శలున్నాయి. కార్యాలయం వేళల తర్వాత ఇక్కడ విచ్చలవిడిగా సంచరిస్తూ, మద్యం తాగుతున్న మందుబాబులు, అటుగా వచ్చే పాదచారులు, వాహన దారులను దుర్భాషలాడడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ సరిగ్గా లేకపోవడం వల్లే మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవడంతోపాటు రాత్రివేళల్లో ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా, గస్తీని పెంచి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

సాయం ఇస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ విమల విద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం మరోమారు తమ ఉదారతను చాటు కున్నారు. 1995-96 బ్యాచ్‌కు చెందిన వై పరుశరాం రెడ్డి అనారోగ్యంతో గతనెల 27న కెజిహెచ్‌లో మృతి చెందగా, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. ఇప్పటికే తల్లిలేక, ఇపుడు తండ్రి మరణంతో అనాధగా మిగిలిన భాగ్యశ్రీకి అండగా నిలవాలని భావించిన పూర్వవిద్యార్థులంతా విరాళాలను పోగేసి, తక్షణసాయంగా భాగ్యశ్రీకి రూ.లక్ష నగదును అందజేశారు.

విశాఖ విమల విద్యాలయం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సెక్రెటరీ జెర్రిపోతుల మోహన్ కుమార్, కమిటీ సభ్యులు ఇచ్ఛాపురం వెళ్లి స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి, సాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ బాసటగా ఉంటామని, డిగ్రీ పూర్తిచేసేందుకు కావాల్సిన సాయాన్ని అందిస్తామని భాగ్యశ్రీకి భరోసానిచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, ట్రెజరర్ ఎస్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

టమాటా ధర నేలచూపులు

- దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.2కు పడిపోయిన వైనం
- కూలి డబ్బులు కూడా రావడం లేదని రైతుల ఆవేదన

ప్రజాశక్తి-దేవరాపల్లి

టమాటా ధర నేల చూపులు చూస్తోంది. దేవరాపల్లి హోల్ మార్కెట్లో టమాటా ధర ఒక్కసారిగా పడిపోయింది. పది రోజుల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధర గత నాలుగు రోజుల నుంచి ఘోరంగా పతనమైంది. కిలో టమాటా రూ.2కి పడిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. 30 కేజీల టమాటాలు రూ.80 నుంచి రూ.50 మధ్య పలికింది. ఈ ధరకు కూడా కొనేందుకు వ్యాపారులు మొగ్గు చూపకపోవడంతో గంటల తరబడి ఎదురు చూసి గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. పెట్టుబడి సొమ్ము కాదు కదా కనీసం కూలి ధర, మార్కెట్‌కు తరలించే రవాణా ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి సాగుచేసిన రైతులకు శ్రమే మిగులుతుంది. రెండు నెలల క్రితం వరకు టమాటా ధరలు ఆకాశాన్ని అంటడంతో రైతులు టమాటా సాగుపై దృష్టి సారించారు. కాని నేడు ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో తీవ్ర నిరాశే మిగిలింది. పంట చేతికందే సమయంలో ధర లేకపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. మార్కెట్‌కు పంటను తరలించేందుకు రవాణా ఖర్చులు రాని పరిస్థితి నెలకొనడంతో కొందరు పొలాల్లోనే టమాటాను వదిలేస్తున్నారు. మార్కెట్‌కు అధిక మొత్తంలో సరుకు రావడం, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు రాకపోవడమే ధర పతనానికి కారణమని పలువురు చెబుతున్నారు. గతంలో టమాటా ధర కేట్ సుమారు రూ.500 నుంచి రూ.400 వరకు ఉండగా, అదివారం దేవరాపల్లి హోల్ సేల్ మార్కెట్లో కేటు రూ.80 మాత్రమే ధర పలికింది. ఈ ధరకు కూడా బలవంతంగా అమ్మాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం రవాణా ఛార్జీలు కూడా రావడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌కు రైతులు పెద్ద మొత్తంలో తెచ్చిన టమాటాలు

సుమారు వెయ్యి ఎకరాల్లో టమాటా సాగు

దేవరాపల్లి మండలంలోని దేవరాపల్లి, రైవాడ, శ్రీరాంపురం, శంభవానిపాలెం, కాశీపురం, నాగయ్యపేట, సీతంపేట, మారేపల్లి, చేనులపాలెం, పెదనందిపల్లి, చిననందిపల్లి, తెనుగుపూడి తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ ఏడాది రైతులు టమాటా సాగు చేపట్టారు. ఎకరా సాగుకు ఎరువులు, సస్యరక్షణ కలిపి సుమారు రూ.80 వేల వరకు ఖర్చు కాగా..., ప్రస్తుతం ధరలతో రూ.5 వేలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అప్పుల్లో కూరుకుపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి

పండించిన పంటను నిల్వ ఉంచేందుకు కాయగూరల మార్కెట్లో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలు నిల్వ చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థానిక మార్కెట్లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకోవాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని కూరగాయల రైతులు ముక్త కంఠం కోరుతున్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అనకాపల్లి జివిఎంసి ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, రిసెప్షన్ సెంటర్, బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరుచు స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్స్‌లు తీసుకొని వచ్చే బస్సుల రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. వచ్చిన బ్యాలెట్ బాక్స్‌లను వెంటనే విశాఖపట్నం స్ట్రాంగ్ రూమ్‌నకు పంపించే ఏర్పాట్లు చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా అదనపు ఎస్పి ఎమ్.దేవా ప్రసాద్, ఆర్‌డిఓ షేక్ అయిషా, డిఎస్‌పి శ్రావణి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే కెడెట్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ఎన్‌సిసి ఆర్మీ విభాగానికి చెందిన కేతిరెడ్డి సత్యశ్యామల ఈ ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న నేపథ్యంలో కళాశాల యాజమాన్యం శ్యామలను గురువారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం అత్యంత ప్రతిష్ఠతో కూడుకున్న అంశమన్నారు. సత్య శ్యామల ఏఎంఏఎల్ కాలేజీ పేరు ప్రతిష్ఠలను ఢిల్లీలో ఇనుమడింపజేశారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు సత్యశ్యామల ఇటు చదువులోనూ, అటు ఎన్‌సిసిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఆమెకు రావలసిన గౌరవం దక్కిందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం మెమొంటో, క్యాష్ అవార్డు రూ.5000 ఇచ్చి సత్కరించింది. కళాశాల ఎన్‌సిసి నేవీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.కొండలరావు రూ.2000, కళాశాల సూపరిండెంట్ పి.అనురాధ రూ.3000 నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కార్యదర్శి తమ్మన రఘుబాబు, కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, అధ్యక్షులు కొల్లూరు ఎస్ఎన్ మంగరాజు, వర్తక సంఘ కోశాధికారి పెంటకోట శ్రీను, పాలకవర్గ సభ్యులు, కళాశాల ఎన్‌సిసి ఆర్మీ ఆఫీసర్లు కెప్టెన్ దాడి జగదీష్, కెప్టెన్ ఏఎస్ఎన్ మూర్తి, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది, ఎన్‌సిసి కెడెట్స్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు వలన నష్టాలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సేవలు గూర్చి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సూపర్వైజర్ అల్లం రత్నం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా గుర్రవానిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో రోడ్లు ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మరకు మాణిక్యం ఆధ్వర్యంలో పరవాడ సీఐ మల్లికార్జునరావుకు గురువారం వినతి పత్రం సమర్పించారు. టిడ్కో ఇండ్లు పొందిన వారు ఆ ఇళ్లలో ఉండకుండా బ్యాచిలర్‌లకు అద్దెకు ఇచ్చారని, ఆ యువకులు రాత్రి సమయంలో మద్యం, గంజాయి తాగి వచ్చి చుట్టుపక్కల ఉన్న ఇండ్ల తలుపులు గుద్ది ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సొంతింటిలో ఉన్న వారిపైకి గొడవలకు వెళ్లడం, దొంగతనాలకు పాల్పడడం, తాళాలు వేసి ఉన్న ఇండ్లు తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న విలువైన సామాన్లు బట్టలు, బంగారం, డబ్బులు దొంగిలిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఇండ్లు అద్దెకిచ్చిన వారిపైనా, దొంగతనాలు పాల్పడుతున్న యువకులపైనా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.అన్నపూర్ణ, టి.సూరమ్మ, జి సీత, వై లావణ్య, జి ప్రియాంతి, రాహేలమ్మ పాల్గొన్నారు.

సిఐకి వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నేత మాణిక్యం, మహిళలు

క్లాప్ వాహన లోడర్ల నిరసన

బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్

యార్డు వద్ద నిరసన తెలుపుతున్న క్లాప్ వాహన లోడర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ పరిధిలో చెత్త సేకరణకు పనిచేస్తున్న క్లాప్ వాహన లోడర్లకు మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ క్లాప్ వాహన డ్రైవర్లు, లోడర్లు యార్డు వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో అందరికీ రెండు నెలల బకాయి ఉంటే, అనకాపల్లి జోన్‌లో మాత్రం మూడు నెలలు నుండి జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు గానీ, కాంట్రాక్టర్లుగానీ పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు లేక వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే సోమవారం నుండి చెత్త సేకరణను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం క్లాప్ లోడర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదు, భారతి, భాస్కరరావు, భవాని, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర హోంమంత్రి అనితను కలిసిన గట్రెడ్డి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని గరిసింగి పంచాయితీ చినగంగవరం గ్రామానికి చెందిన జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గట్రెడ్డి కొండలరావు (జికె) బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితని నక్కపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధికారంలో లేనప్పుడు తెలుగు యువతపై పెట్టిన పోలీస్ కేసులు నుండి విముక్తి కలిగించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి యువకునికి మండల, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు కొండలరావు స్థానిక విలేకరులకు గురువారం తెలిపారు.

అనితతో టిడిపి నేత గట్రెడ్డి కొండలరావు

వికలాంగ పిల్లల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి-అనకాపల్లి : హైకోర్టు లీగల్ సెల్ అథారిటీ ఆదేశాల మేరకు వికలాంగ పిల్లలను గుర్తింపునకు ఇంటిగ్రేటెడ్ టీమ్‌లు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాయి. అంగన్వాడీ, ఏఎన్ఎం, లీగల్ సహాయకులు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ నెల 13వ తేదీ నుంచి 15 రోజుల పాటు జరగనుంది. వికలాంగ పిల్లలను గుర్తించి దానికి గల కారణాలను శోధించి పరిష్కార మార్గాలు ఏమైనా ఉంటే సూచిస్తారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కరుణ, ఆశ వర్కర్ ఆశ, ఐసిడిఎస్ లక్ష్మి, ఏడబ్ల్యూడబ్ల్యూ సిబ్బంది పుష్ప, లీగల్ సహాయకులు శ్రీకాంత్, కుసుమ, వనజ, అనిత, కుమారి, అరుణ, సుబ్బలక్ష్మి, శైలజ, ఎంఎల్ఎస్ఏ ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయ వినాయక ఆలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణం విజయ రామరాజుపేటలో శ్రీవిజయ వినాయక ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ఆలయానికి విచ్చేసి వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రాంకీని సత్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1993-94 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు హై స్కూల్ ఆవరణలో గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గతంలో హైస్కూల్లో చదువుకున్న పలు బ్యాచ్‌ల విద్యార్థులు పాఠశాలలో స్టేజ్ నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, ఆడారి గంగ మహేష్, పాలిమేర దేవత నాయుడు, బలరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : నాంది ఫౌండేషన్ సహాయంతో తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారుగా 170 బాలికలకు స్పోర్ట్స్ కిట్స్‌ను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌రావు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, తల్లిదండ్రులు, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కల్తీ

డిటికి వినతిపత్రం ఇస్తున్న నారాయణ దంపతులు

విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-మునగపాక : పట్టాదారు పాస్ పుస్తకాల్లో పేర్లు సవరణ చేసేందుకు లంచం అడుగుతున్న వీఆర్వో సురేష్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతు ఎంవిఎస్ నారాయణ దంపతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిటి శేషు కుమార్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తన తండ్రి తదనంతరం సంక్రమించిన పంట భూమిని తమతో పాటు తన సోదరుని కుటుంబం గ్రామ పెద్దల మధ్యవర్తిత్వంతో పంచుకోవడం జరిగిందని తెలిపారు. అయితే 2023లో తమకు వచ్చిన పాస్ పుస్తకాలలో కొలతలు, పేర్లు తప్పులు పడటంతో వాటిని సవరించాలని సర్వేయర్‌ను అడుగ్గా మ్యుటేషన్ కట్టాలని చెప్పగా అమౌంట్ చెల్లించినట్లు చెప్పారు. అయినా పాస్ పుస్తకాలు సవరించలేదని, దీనిపై జనవరి 2న జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా దరఖాస్తు పెట్టానని తెలిపారు. దీనిపై ఇటీవల స్థానిక వీఆర్వో సురేష్‌తో పాస్ పుస్తకాల సవరణపై మాట్లాడగా దానికి సురేష్ 'మీ ఫైల్ నా చేతుల్లో ఉంది. తహశీల్దారు టేబుల్ మీదకు వెళ్లాలంటే ఆఫీస్ ఫార్మాలిటీస్ కట్టాలి. లేకపోతే పని జరగదు' అని చెప్పినట్లు పేర్కొన్నారు. దీనిపై ఎంఆర్ఒతో మాట్లాడుతానని తాను చెప్పగా, 'మీ పేరున పాస్ పుస్తకాలు పాతవి లేవు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ లేవు. ఇతరత్రా పేపర్లు లేవు. కావున తప్పనిసరిగా మీరు రిజిస్ట్రేషన్ చేయించుకోవలసి ఉంటుంది. దానికి అధిక మొత్తంలో ఖర్చు అవుతుంది. మాకు రూ.10 వేలు ఇస్తే మీ పని అయిపోతుంది' అని విఆర్ఒ చెప్పినట్లు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఎస్‌సి ఎబిసిడిల వర్గీకరణ చేయాలని ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు డిమాండ్ చేశారు. గురువారం చోడవరంలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఎంఈఎఫ్, ఎంఎస్పి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని వర్గీకరణ చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, అలా చేస్తే రాష్ట్రంలో రెండు మూడు జిల్లాలు తప్ప మిగతా జిల్లాలో ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాల వారందరికీ అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు ఏలుచూరి ఘటిలు, కొల్లి చిన్నఅప్పారావు, చెవ్వేటి అప్పారావు, మోర్తా శ్రీనివాసరావు, గొట్టివాడ సామ్రాట్ కుమార్, ఖండేల వెంకటరావు, కోరుమిల్లి మారాజు తదితరులు పాల్గొన్నారు.

పులపర్తి సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి-యలమంచిలి : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, సర్పంచ్ బాధ్యతలు నిర్వహించడంలో న్యాయం చేయలేకపోతున్నానని అందుకు తన సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పులపర్తి సర్పంచ్ సుంకర కొండబాబు గురువారం యలమంచిలి ఎంపిడిఒ కె.ఎస్.కొండలరావుకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాజకీయంగా వైసిపిలో ఎదిగిన కొండబాబు అవకాశవాదిగా రాజీనామా ప్రకటించారని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

ట్యాంకరు ద్వారా మంచి నీటి సరఫరా

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బంగారయ్యపేట ఎస్‌సి కాలనీలో ఇంటి ఇంటికి కుళాయిల పైప్‌లైన్‌కు గోతులు తవ్విన నేపథ్యంలో నీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనిని గుర్తించిన డాక్టర్ గల్లా రాజు వ్యాటర్ ట్యాంకర్ ద్వారా సంత వాటర్ పంపు నుండి నీటిని తెచ్చి పంపిణీ చేశారు.

ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

జంపపాలెం వాసుల ఫిర్యాదుతో విచారణ

ప్రజాశక్తి-యలమంచిలి

మండలంలోని జంపపాలెం గ్రామంలో నెలనెలా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కల్తీ చేసి సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆరు నెలలుగా రేషన్ సరుకుల్లో నలకలు, చెత్త, కాకిరెట్టలు మొదలైన అపరిశుభ్రమైన బియ్యం పంపిణీ చేస్తుండడంతో గ్రామస్తులు వెలగా సత్తిబాబు, ఆళ్ల భవానీ, బొడ్డేటి ఆదిలక్ష్మి, వెలగా చిన్న నాయుడు, దాడా లోకేష్, ఎల్లపు మహేష్‌లు గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ నూకరాజు జంపపాలెం వెళ్లి విచారణ జరిపారు. రేషన్ డీలరు తప్పిదం వల్లే ఈ కల్తీ జరిగిందని విచారణలో తేలినట్లు ఆయన చెప్పారు. డీలర్‌పై చర్యలకుపై అధికారులకు రిపోర్టు చేస్తున్నామని ప్రజాశక్తి విలేకరికి డిటి తెలిపారు. ఎప్పటినుంచో ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని, డీలర్ పట్టించుకోవడం లేదని, అమ్మేసుకోనే బియ్యం ఎలా ఉంటే ఏమిటని వెటకారంగా జవాబు చెబుతున్నారని గ్రామ సర్పంచ్ ఆరోపించారు. డీలరుపై తగిన చర్యలు తీసుకోవాలని పై అధికార్లకు ఫిర్యాదులు చేస్తామన్నారు.

చెత్తా చెదారంతో ఉన్న రేషన్ బియ్యం

రక్తహీనత అవగాహనా దినోత్సవం

ప్రజాశక్తి -ఉక్కునగరం : గాజువాక పారిశ్రామిక ప్రాంతం చిన్నగంట్యాడ శ్రామికనగర్‌లోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో లీ ఫార్మా ఆధ్వర్యంలో ప్రపంచ రక్తహీనత అవగాహన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని కళాశాల ప్రాంతంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం జెసిఐ ప్రతినిధులు రమ్య అగస్త్య, జయలక్ష్మి మాట్లాడుతూ, కాలేజీలో 136మంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించగా, కేవలం ఐదుగురు మాత్రమే 13 శాతం హిమోగ్లోబిన్ కలిగి ఉన్నారని, మిగిలిన 131 మంది రక్తహీనత ఐరన్ లోపం వంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు.. రక్తహీనతతో శరీర భాగాలకు సరిగా ఆక్సిజన్ అందక అనారోగ్యసమస్యలు తలెత్తుతాయన్నారు. రక్తహీనత అవగాహన దినోత్సవం థీమ్ 'రక్త ఆరోగ్యం కోసం మీ చేతులు పైకి ఎత్తండి' నినాదంతో విద్యార్థులు ప్రచారం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పివిడి సౌజన్యకుమారి, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి క్లైర్ బోటనీ ఆచార్యులు వి సుజాత, ఆంగ్ల అధ్యాపకురాలు మాధవీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గొట్టేటి రవి ఆధ్వర్యంలో నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజినీ నాయుడి జయంతిని నిర్వహించారు. సాంఘిక శాస్త్ర విభాగం, ఎన్‌సిసి బాలికల విభాగం ఆధ్వర్యంలో సరోజినినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధురాలిగా, రచయితగా సరోజినినాయుడు అసమాన పరిజ్ఞానాన్ని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ అచ్యుతరావు, కో ఆప్షన్ సభ్యులు ఉపాధ్యాయులు వరలక్ష్మి, తులసి పాల్గొన్నారు.

జాతీయ మహిళా దినోత్సవం

అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో గురువారం సరోజినీ నాయుడు 146వ జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సరోజినీ నాయుడు చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, సూపరింటెండెంట్ అనురాధ పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సరోజినీ నాయుడు పేరు మీద మహిళా దినోత్సవాన్ని జరపటంలో గల ప్రాముఖ్యతను తెలియజేశారు. కళాశాల సూపరింటెండెంట్ పి అనురాధ మాట్లాడుతూ సరోజినీ నాయుడుతో పాటుగా ఎందరో మహిళలు భారతదేశ చరిత్రలో తమ ముద్రను వేసి దేశ భవిష్యత్తును నిర్దారించిన వాళ్లలో ఉన్నారని, అటువంటి వాళ్లను ఆదర్శంగా తీసుకొని నేటి బాలికలు ఎదగాలని కోరారు. విద్యార్థినులు సునీత, ఆశ, లూథియా, వాసవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, మహిళా సాధికారత కో ఆర్డినేటర్ సామ్రాజ్యం, కళాశాల మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహాత్మ జ్యోతిబాపూలే ఏపి వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్, 5వ తరగతిలో ప్రవేశం కొరకు, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లుకు ప్రవేశ పరీక్ష ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ (బాలికలు) పరవాడ మండలం తానాం గురుకుల కళాశాలలో, ఇంటర్మీడియట్ (బాలురు) కొరకు సింహాచలంలోని గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఎస్‌సి సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని బాలురుకు అనకాపల్లి, నర్సీపట్నం బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, బాలికలకు తానాం, చోడవరం, పాయకరావుపేట బీసీ గురుకులాల్లోనూ 5వ తరగతిలో ప్రవేశం, 6 నుండి 9వ తరగతుల వరకు ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో స్థానం సంపాదించిన విద్యార్థులకు అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో ఉత్తమ శిక్షణ, ఉచిత విద్య, వసతి కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యా కానుక, ఉచిత యూనిఫామ్, ఉచితంగ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తామని, యోగా, స్పోర్ట్స్, క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15 నుండి మార్చి 15వ తేదీ లోపల ఆన్లైన్ website:https://mjpap-bcwreis.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న, 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 27వ తేదీన, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు తనను సంప్రదించాలని కోరారు.

జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు

జాబ్ మేళాలో 112 మంది ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ వారి ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ మేళాలో 112 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఈ డిగ్రీ కాలేజీలో 2022, 2023, 2024 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు, ఇతర నిరుద్యోగ యువత కోసం నక్కపల్లి హెటిరో ఫార్మా కంపెనీ, అచ్యుతాపురం యోకొహామా టైర్స్ తయారీ సంస్థ ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు చెప్పారు. 95 మంది హెటిరో ఫార్మా కంపెనీకి, 17 మంది యోకొహామా టైర్స్ కంపెనీకి ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో తమ డిగ్రీ కళాశాల నుండి 25 మంది అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీల హెచ్ఆర్‌లు ఐ.నరేష్, ఎస్.సాయి కుమార్, శ్రావణ్ కుమార్, జేకేసి కోఆర్డినేటర్ బి.శంకర్, కె.దేముళ్ళు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ అధ్యక్షునిగా నానాజీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం గౌరీ శంకర ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా మండలంలోని గంధవరం గ్రామానికి చెందిన బేరా నానాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బేరా వెంకట్రావు, డైరెక్టర్లుగా ఇంటి రాము, ఇంటి శంకర్రావు, మురుమర్ల రాము, బేరా శీను, వానపల్లి దేవుళ్ళు ఎన్నికయ్యారు. ఎలక్షన్ అధికారిగా ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారి శివాజీ వ్యవహరించారు. 207 మంది సభ్యులు గాను 188 మంది సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోనే సాధారణ ప్రసావాలు జరిగే విధంగా చూడాలని సూచించారు. అనంతరం ఓ.పి గదిని, ఫార్మసీ గదిని, రక్త పరీక్షలు చేసే గదిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ, కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిరాం, యుడిసి ఆనంద్ కుమార్, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ఎమ్ అన్నపూర్ణేశ్వరి పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-పరవాడ : వాడచీపురుపల్లి, పరవాడ సబ్‌స్టేషన్‌ల్లో పాడైపోయిన 11కేవీ జంపర్‌ల స్థానంలో చెట్లులు తొలగింపు వంటి పనుల కారణంగా ఈ నెల 14న శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలను నిలుపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఎస్ రామకృష్ణ తెలిపారు. దీని వల్ల పరవాడ, రావాడ, వెన్నలపాలెం, భరణికం, గొర్లివానిపాలెం, పి.ఎస్ బోనంగి, దేశపాత్రునిపాలెం, కలపాక, ఈదులపాక బోనంగి, వాడచీపురుపల్లి నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

కె.కోటపాడు : కె.కోటపాడు ఫీడర్లో శుక్రవారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ మరమ్మతు పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు ఉండదని వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

చింతలపూడిలో ఉచిత వైద్య శిబిరం

దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దేవరాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి ఈ.పూజ్య మేఘన రోగులను పరీక్షించారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఎస్ జి. పుష్పరాజ్, ఎఎన్ఎం ఎన్.లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు భవాని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో శ్రీ కుంచాలమ్మ, బంగారమ్మ తల్లి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండే ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సామ గరిడిలు, చిటికెల భజనలు, మహిళా కోలాటం, మందుగుండు సామగ్రితో తీర్థ ఘనంగా జరిగింది. రాత్రికి భారీ స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశారు.

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు

-హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత

మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి-నక్కపల్లి:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాయకరావుపేట నియోజక వర్గంలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నక్కపల్లిలో క్యాంపు కార్యాలయం వద్ద గురువారం నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటిని ఎన్‌డిఏ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు .త్వరలో పాయకరావుపేట నియోజకవర్గంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని మంత్రి అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

నక్కపల్లి:పాయకరావుపేట మండలం మంగవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. మండలంలోని సారిపల్లిపాలెం, క్రిష్ టౌన్ షిప్ హెూంమంత్రి స్వగృహంలో గురువారం హెూం మంత్రి అనిత సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పాయకరావుపేట మండలం మంగవరం ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షులు గూటూరు రామగోవిందు, డైరెక్టర్లు శివ, వెంకటరావు, బుజ్జి, గణేష్, రమణ తదితరులకు హెూం మంత్రి వంగలపూడి అనిత పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మెటీరియల్ ఇస్తున్న శ్రీనివాసరావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు, రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్దేశంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, బోడపాలెం సర్పంచ్ ఎరుకు నాయుడు, రామన్నపాలెం సర్పంచ్ చిన్న అప్పన్న పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండల కేంద్రంలో షిరిడి సాయిబాబా మందిరం 28వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించినట్టు ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త నేమాని గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, గురువారం వార్షికోత్సవం వేడుకలో భాగంగా ఉదయం 7గంటల నుండి స్వామివారికి పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకం చేశామన్నారు. అనంతరం 12 గంటల నుండి భారీ అన్నసమారాధన నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పక్కుర్తి నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి వైబోయినా సోమేశ్వరావు, బత్తుల స్వామి, మాజీ సర్పంచ్ కందుల నాగేశ్వరావు, మడగల బుజ్జి, పక్కుర్తి గంగ భవాని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని రేబాక శివారు తిరుపతిపాలెం గిరిజన గ్రామంలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమైంది. ఈ గ్రామానికి చెందిన తామాడ చించయ్యమ్మ అనే వృద్ధురాలు గురువారం ఉదయం వంట చేస్తున్న సమయంలో ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో ఆ వృద్ధురాలిని సురక్షితంగా స్థానికులు బయటకు తీసుకువచ్చారు. ఇంట్లో వున్న సామగ్రి కాలి బూడిదవ్వడంతో సుమారు 2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్ఐ కన్నబాబు, వీఆర్వో దేవుడు వివరాలు సేకరించారు. సర్పంచ్ సాధిరెడ్డి శ్రీనివాసరావు, వెల్లంకి కాసులు, కూటమి నాయకులు కరణం సూరిబాబు, రాజేశ్, సాదిరెడ్డి వర ప్రసాద్, గంట్యాడ రమేశ్, గడ్డిమళ్ల శ్రీను, సాదిరెడ్డి శ్రీను బాధితురాలిని పరామర్శించారు.

దగ్ధమైన పూరిల్లు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్. నాగాపురం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై ఐసిఆర్పి సత్యవతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఘన జీవామృతం తయారీపై కూనిశెట్టి రామారావు పశువుల శాల వద్ద వివరించారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు సేనాపతి వరహాలబాబు మాట్లాడుతూ, ఘన జీవామృతం తయారు చేయడానికి ఆవు పేడ, పప్పుల పిండి, ఆవు మూత్రం, పుట్ట మన్ను బెల్లం ఇవన్నీ మిశ్రమంగా కలిపి లడ్డు సైజులో తయారు చేయాలన్నారు. ఈ మిశ్రమం తయారు చేసిన ఉండలను ఏడు రోజులు వరకు నీడన ఆరిన తర్వాత ఆ మిశ్రమాన్ని పౌడర్‌గా చేసి గోనెసంచిలో ఆరు నెలల వరకు నిల్వ ఉంచుకోవచ్చని చెప్పారు.పంట పొలాల్లో మిశ్రమం చల్లితే భూమిలో పోషకాలు పెరిగి డిఎపి ఎరువులా పనిచేస్తుందన్నారు. ఈ పద్ధతిని పాటించడంతో ఖర్చు తగ్గి ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ రామకృష్ణ, ఏపీసీఎన్ఎఫ్ ఆల్ గొలుగొండ మండల ఐసిఆర్పీలు తెలుగుదేశం పార్టీ నాయకులు మంతెన సూరిబాబు రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సత్యవతి

కోళ్ల ఫారాలు పరిశీలన

యజమానికితో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- మాడుగుల:ఉభయ గోదావరి జిల్లాలలో బర్డ్ ఫ్లూ వైరస్ విస్తరిస్తుండడంతో చీడికాడ, మాడుగుల మండలానికి మూడు రేపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేయడం జరగిందని మాడుగుల ఏరియా పశువైద్య శాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో బృందాలు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం రెండు మండలాలలో కోళ్ల ఫారాలలో మరణాలు లేవని గుర్తించామని, పౌల్ట్రీ రైతులు బయో సెక్యూరిటీ చర్యలు పాటించాలన్నారు. పౌల్ట్రీలో పని చేసే సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఏదైనా కోళ్లు చనిపోతే సంబంధిత పశు వైద్యాధికారులకు తెలియజేసి పూడ్చి పెట్టాలని సూచించామన్నారు. రైతులు బర్డ్ ఫ్లూ గురించి ఆందోళన చెందవద్దని బాగా ఉడికించిన చికెన్, కోడిగుడ్లు తినవచ్చనని తెలియజేశారు.

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం పంచాయతీ శివారు పల్లావూరు గ్రామంలో అక్రమంగా భూమిని కబ్జా చేసి ఆ భూమిలో కాంపౌండ్ వాల్ కడుతున్నారని, తక్షణమే ఆ భూమిని నుండి కాపాడాలని బాధితులు కోరారు. ఈ మేరకు గురువారం నర్సీపట్నంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ చార్జ్, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గతంలో తమ పెద్దలు సర్వే నెంబరు 39లో 30 సెంట్ల భూమిని బడి, గుడి, వాటర్ ట్యాంక్, కమ్యూనిటీ హాలు కట్టుకొనుటకు ఇచ్చారన్నారు. ఈ భూమిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాక కట్టుకున్నాడని, తీసి వేస్తానని చెప్పి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేయించుకొని ఇప్పుడు ఆ స్థలంలో కాంపౌండ్ హాలు కడుతున్నారన్నారు. దీంతో తాము నీళ్ల ట్యాంకుకు వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థలాన్ని కాపాడి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, సలాదుల ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదు పత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

రోడ్డు నిర్మాణానికి నివేదిక : ఆర్‌డిఓ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొత్తఎల్లవరం శివారు గిరిజనులు ప్రత్యేకంగా నివాసముంటున్న డొంకాడ గ్రామానికి తారురోడ్డు ఏర్పాటు నిమిత్తం నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ గురువారం ఆ గ్రామంలో పర్యటించారు. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్డు మంజూరైంది. హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. అది అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డొంకాడ గ్రామానికి రోడ్డు మంజూరు కోసం ఆర్డీవో, తహశీల్దార్ పి.శ్రీనివాసరావుతో కలిసి కె.ఎల్లవరం కరక బీటీ రోడ్డు నుంచి డొంకాడ గ్రామం వరకు వెళ్లి పరిశీలించారు.రోడ్డు నిర్మాణంపై నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

పరిశీలిస్తున్న సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్

భూముల వివరాలు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో అమ్మపేట, కొత్తమల్లంపేట, చోద్యం గ్రామాల్లో నర్సీపట్నం సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ అధికారిణి టి.శ్రీదేవి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులతో సమావేశ మయ్యారు. రైతులు ఫార్మర్ రిజిస్టర్, భూములు ఆన్ లైన్ నమోదు చేసుకోవాలని చెప్పారు. గడువు లోపు ఆన్ లైన్‌లో భూములు రిజిస్టర్ కాకపోతే ప్రభుత్వం సంక్షేమ పథకాలు, రాయితీ, రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు పొందే అవకాశం లేదని సూచించారు. ఈ అవకాశం ఈ నెల 25 ఉందని రైతులు అందరూ తప్పని సరిగా గడువులోపు ఆన్ లైన్ లో భూముల వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల14, 15 తేదీల్లో 132 కేవీ నర్సీపట్నం సబ్ స్టేషన్ నుండి వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే సరఫరా వేళల్లో మార్పులు ఉంటాయని నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావు ఒక ప్రకనటనలో తెలిపారు. పాయకరావుపేట 132 కేవీ పెద్దాపురం లైన్‌లో మరమ్మత్తుల కారణంగా నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల మండలాలు, కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ రెండు రోజుల్లో రాత్రి 1 గంట నుంచి ఉదయం 7 గంటల వరకు, మరలా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం పెద్దచెరువులో గురువారం ఉదయం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. అటుగా వెళుతున్న వారు ఈ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలు నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు(75)గా గుర్తించారు. ఈ నెల 10న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చుట్టలు తెచ్చుకొనుటకు గాను ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆ రోజు నుండి గాలించామని కుటుంబ సభ్యులు తెలిపారు.

చందనాడలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడంతోలో ఓల్టేజ్ సమస్య లేకుండా ఉంటుందని తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుణ్యమంతుల బాబ్జి అన్నారు. గ్రామంలో లో ఓల్టేజ్ సమస్య కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారిని తెలిపారు. లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు విన్నవించడంతో, అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు.

ఏర్పాటు చేయిస్తున్న నాయకులు

విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్య ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి అప్పారావు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు 45 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు యం.సాయి చంద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్న

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం పలువురు బాధితులకు అందజేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 24వ వార్డుకి చెందిన పెట్ల రాజు రూ.50వేలు, నాతవరం మండలం మాధవనగరం గ్రామానికి చెందిన ఘంటా సాయికి రూ.1,10,110 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. గడచిన ఆరు నెలల కాలంలో నియోజకవర్గంలో 18 మందికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించగలిగామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అంకిత భావంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం 24వ వార్డు కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, తాతీలు మాస్టారు, నాతవరం పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి రమణ, గంటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొనే వారేరి..?

-సంతలో కేట్ ధర రూ.50
- మార్కెట్ ఆశీలు రూ.20
-రవాణా చార్జీలు రూ.20
-రైతుకు మిగిలింది రూ.10
-టమోటా ధరలు భారీగా పతనం

కొనుగోలు చేసే వారు లేక ఖాళీగా కూర్చున్న రైతులు

ప్రజాశక్తి-గొలుగొండ:గత నాలుగు రోజుల నుంచి టమోటా ధరలు దారుణంగా పడిపోయాయి. ఈ వారం మొదట్లో 30 కేజీల గల కేట్ ధర రూ.150 వరకు పలకగా గురువారం ఉదయం రూ.50కే కొనే నాథుడు లేదు. దీంతో టమాటా రైతు అత్యంత దయనీయస్థితి ఎదుర్కొంటున్నాడు. మండలంలో ఈ ఏడాది కృష్ణదేవిపేట, లింగంపేట, చోద్యం, రామచంద్రపురం, గొరంపేట, గొలుగొండ, జోగుంపేట, చీడిగుమ్మల, గుండుపాల, పాకలపాడు, ఏటిగైరంపేట తదితర గ్రామాల్లో సుమారుగా 150 ఎకరాల్లో టమాటా సాగు చేశారు. మొదట్లో క్రేట్ ధర రూ.400 ఉండగా గత వారం నుంచి క్రమేపీ తగ్గుతూ గురువారం నాటికి దీనస్థితికి చేరి రూ.50కు పడిపోయింది. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతాంగం పండించిన ఫలసాయాన్ని కుళ్ళబెట్టుకోలేక, గిట్టుబాటు ధరకు అమ్మలేక పలు అవస్థలు పడుతున్నారు. గురువారం నాడు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కృష్ణదేవిపేట టమాటాలను తరలించిన రైతులు క్రేట్కు రూ.50రాగా మార్కెట్ ఆశీలు రూ.20, రవాణా చార్జీలు 20పోగా పది రూపాయలతో రైతులు తీవ్ర ఆవేదనతో వెనుదిరిగారు. అందుకే ప్రతీ మండలానికి శీతల గిడ్డంగిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తే రైతులు ఫలసాయాన్ని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే వీలుంటుందని, కూరగాయల రైతులు తెలిపారు.

పూర్ణ మార్కెట్లో తొలగించిన

చిల్లర వర్తకులకు పునరావాసం కల్పించాలి

సిపిఎం కార్పొరేటర్ బి. గంగారావు

ఆందోళన చేస్తున్న గంగరావు, వ్యాపారులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:తమ దుకాణాలను అక్రమంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ పూర్ణా మార్కెట్ చిల్లర వర్తకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖపట్నంలోనే అతి పురాతనమైన పూర్ణా మార్కెట్లో ఎంతోకాలంగా వ్యాపారాలు చేసుకుంటున్న చిరువర్తకులను తొలగించడం అన్యాయం అన్నారు. వీరి వ్యాపారంతో ఎటువంటి సంబంధం లేని లా అండ్ ఆర్డర్ విభాగం పోలీసులు వీరి జంగిడీలను, పూలు, కాయగూరలు, పండ్లను విసిరివేయడం అమానుషం అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లో ఎటువంటి నిర్ణయాలు చేయకుండా నగర మేయర్, కార్పొరేటర్లకు ఎటువంటి సమాచారం లేకుండా ఏకపక్షంగా దుందుడుకు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. రూ.5 ఆశీలు వసూలు చేసే దగ్గర అక్రమంగా రూ.50, రూ.100 వసూలు చేస్తున్నారని అడిగిన పాపానికి ఇటువంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. నగర మేయర్ ను కలిసి విషయం తెలియజేశామని వెంటనే తగు చర్యలు తీసుకొని సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని, వారం రోజులుగా పూట గడవక పస్తులతో కాలం గడుపుతున్న వ్యాపారస్తులకు మరల వ్యాపారం చేసుకునేలా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు చేసినట్టు తెలియజేశారు. అనంతరం జోనల్ కమిషనర్, కమిషనర్లకు సమస్యను పరిష్కరించాలని కోరినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ నాయకులు ఎం.సుబ్బారావు, బత్తిన రాము, గోవింద్, ఈశ్వరరావు, అప్పారావు,శ్రీను ఇతర చిల్లర వర్తకులు పాల్గొన్నారు.

మీటర్ రీడింగ్ చూపుతున్న వినియోగదారుడు

విద్యుత్ బిల్లు రూ.24వేలు

-షాక్‌కు గురైన వినియోగదారుడు

ప్రజాశక్తి-రావికమతం :విద్యుత్ బిల్లు వేలకు వేలు రావడంతో వినియోగదారుడు షాక్కు గురయ్యాడు. మండల కేంద్రానికి చెందిన టెక్కలి రమణ పత్రికా విలేకరులతో గురు వారం తన ఆవేదన వెలి బుచ్చాడు. తన విద్యుత్ మీటర్ బిల్లు రూ.24వేలు రావడం చాలా ఆశ్చర్యకరంగా ఉందన్నారు. గతంలో తన ఇంటి కరెంట్ బిల్లు నెలకు 900 రూపాయలు వచ్చేదన్నారు. ఒక్క సారిగా 24 వేలు బిల్లు రావడంతో ఆశ్చర్య పోయాడు.

మాట్లాడుతున్న సిఐ

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

-నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ సూచించారు. గురువారం గొలుగొండలో బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. వీటికి దూరంగా ఉండి విద్యపై ఆసక్తి చూపాలన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

-కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:విద్యకు, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం డాబా గార్డెన్స్ లో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలను, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యే విధంగా సన్నద్ధం చేయాలని సూచించారు.వసతి గృహంలో ఉండే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని చెప్పారు.సంబంధిత అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. అక్కడి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. అనంతరం కృష్ణా కళాశాలను సందర్శించారు. కృష్ణానగర్ పరిధిలో ఉన్న మలేరియా నియంత్రణ కార్యాలయాన్ని సందర్శించారు.ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు, డిఎంఈవో, మలేరియా నివారణ అధికారి,ఇతర అధికారులు ఉన్నారు.

ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీలపై 19న ధర్నా

వార్వా,నివాస్ సంఘాల నాయకులు వెల్లడి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వార్వా,నివాస్ సంఘాల నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:వార్వా,నివాస్ కార్యనిర్వాహక కమిటీ సమావేశం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వార్వా అధ్యక్షుడు ఎన్.ప్రకాష్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నగరంలోని అపార్ట్మెంట్లు, కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించారు. నగరంలోని అనేక వార్డుల్లో మురుగు నీటి సమస్య, రోడ్లపైన స్వైరవిహారం చేస్తున్న పందులు, కుక్కల సమస్యలు, గుంటలు పడిన రోడ్లు,పై ఓవర్లు అండర్ పాస్ లు లేకపోవడంతో ఎదుర్కొంటున్న ట్రాఫిక్, వీధి లైట్లు, సిటీ బస్సుల లేమి వంటి సమస్యలు చర్చించారు. సిటీలో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజ్ నిర్మాణం చేసి ఇళ్లకు కనెక్ట్ చేయకపోవడం,రైతు బజార్లు నిర్మించి వాటిని ఓపెన్ చేయకపోవడం కూడా జరిగిందని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు.ఆస్తిపన్ను సమీక్షిస్తానని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, డిస్కంలను ప్రైవేటీకరణ చేయరాదని,విద్యుత్ లో ప్రీపెయిడ్ రీచార్జీ విధానం అమలు చేయరాదన్నారు. ఈ సమస్యలపై అన్నీ జోన్ల లోనూ నిరసన ప్రదర్శనలు జరపాలని, మార్చి 19న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమస్యలను వివరిస్తూ సమావేశం ఒక కరపత్రాన్ని విడుదల చేసింది. ఈ సమావేశంలో వార్వా ప్రధాన కార్యదర్శి బి.బి గణేష్, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి జి.వి రమణ, అక్కయ్యపాలెం జోన్ కు చెందిన ఖాన్, గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి బి.ఎ త్రినాథ్ స్వామి, మధురవాడ జోన్ కార్యదర్శి జి.రఘురాం, గోపాలపట్నం జోన్ కార్యదర్శి ఎ.గోవిందరావు, కంచరపాలెం జోన్ కార్యదర్శి జి.నాయుడు బాబు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ కోరారు. లోక్ అదాలత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జాతీయ లోక్ అదాలత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బీమా కంపెనీల ప్రతినిధులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్న ఈ సమావేశంలో వెంకటశేషమ్మ మాట్లాడుతూ, లోక్ అదాలత్లో బ్యాంకు, బీమా సంస్థలకు చెందిన ఇన్సూరెన్స్ కేసులు ఎక్కువ ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షులు వల్లభనాయుడు పాల్గొన్నారు.